క్లుప్తంగా

కాపుల అభివృద్ధికి సహకరించండి



ఎమ్మెల్యే చంటిని కలిసిన కాపు సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : టీడీపీ ప్రభుత్వం కాపుల అభివృద్ధికి సహకరించాలని కాపు సంక్షేమ సేవా సంఘం నాయకులు కోరారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా ఏలూరు విచ్చేసిన కొలుసు పార్థసారథిని గురువారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో సంఘం నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బడేటి చంటిని, ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పులి శ్రీరాములు, కానాల రామకృష్ణ, మోటేపల్లి చంద్రశేఖర్, పూజారి నిరంజన్, లింగిశెట్టి శశికుమార్, చెరుకుతోట రామలక్ష్మణులు, దండిపాటి జగన్మోహనరావు, నడపన దాన భాస్కరరావు తదితరులున్నారు.

చిన్నారుల వ్యక్తిగత వివరాలపై ఆరా



రాజేంద్ర ప్రసాద్‌కు మొక్కను అందిస్తున్న చిన్నారులు

ఏలూరు (టూటౌన్): స్థానిక విద్యానగర్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న శిశు గృహాన్ని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు డాక్టర్ జంగం రాజేంద్ర ప్రసాద్ చైల్డ్‌కేర్ ఇనిస్టిట్యూటషన్స్ నోడల్ అధికారి జె.దుర్గాప్రసాద్‌తో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం శిశుగృహంలో ఆశ్రయం పొందుతున్న ఎనిమిది మంది చిన్నారుల వ్యక్తిగత వివరాలను అడిగి తెలుసుకున్నారు. దత్తకు అర్హులైన బాలలకు సంబంధించి లీగల్లీ ఫ్రీఫర్ అడాప్షన్ ఆర్డర్ వెంటనే ఇవ్వాలని సీడబ్ల్యూసీ సభ్యులను ఆదేశించారు. బాలలకు అందిస్తున్న సేవలను, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అందిస్తున్న సహకారం రాష్ట్రంలో ఏ జిల్లాలో లేనివిధంగా ఇక్కడి శిశు గృహాన్ని అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్ సూర్యచక్రవేణి, శిశు గృహం మేనేజర్ భార్గవి పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

- మౌలిక సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాలి
- కోఆప్షన్ సభ్యుడు పెదబాబు






సమావేశానికి హాజరైన సచివాలయ ఎమినిటీస్ సెక్రటరీలు, ఇంజినీరింగ్ అధికారులు, మాట్లాడుతున్న కోఆప్షన్ సభ్యుడు పెదబాబు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని, అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, ఇదే పద్ధతి కొనసాగితే చర్యలు తప్పవని ఏలూరు కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ హెచ్చరించారు. ఏలూరు కార్పొరేషన్ కార్యాలయం పాత కౌన్సిల్ హాలులో గురువారం నగరంలోని 79 సచివాలయాల ఎమినిటీస్ సెక్రటరీలు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెదబాబు, వెంకటకృష్ణ మాట్లాడుతూ ఏలూరు నగర ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, మంచినీటి సరఫరా, రోడ్లు పరిశుభ్రంగా ఉంచడం, వీధిలైట్ల నిర్వహణ, పాఠశాలల నూతన గదుల నిర్మాణం, పార్కుల నిర్వహణ, స్కూళ్లలో మౌలిక వసతులు, నూతనంగా ఇళ్లు, మరుగుదొడ్ల నిర్మాణాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు వంటి అనేక విధులు నిర్వర్తించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. సెక్రటరీలు క్షేత్రస్థాయిలో పనిచేయకుండా అలసత్వం వహిస్తున్నారని, లబ్ధిదారులకు ఆన్‌లైన్ సేవలు సక్రమంగా చేయడం లేదని బాధితుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన సేవలు, సౌకర్యాల కల్పనకు ప్రతి ఉద్యోగి క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలోకి వెళితేను ప్రజా సమస్యలు తమ దృష్టికి వస్తాయని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, అనంతరం రికార్డుల్లో నమోదు చేయాలని అన్నారు. అధికారులు సచివాలయాలకు తనిఖీకి వచ్చినప్పుడు రికార్డులను వారికి చూపించాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ జి.చంద్రయ్య, ఇన్‌చార్జి ఎంఈ కొండలరావు, ఏఈలు, సచివాలయ ఎమినిటీస్ సెక్రటరీలు ఉన్నారు.

కల్లుగీత సొసైటీలకు మద్యం షాపులు కేటాయించాలి



జుత్తిగ నరసింహామూర్తి

ఏలూరు (టూటౌన్): రాష్ట్రంలో కల్లుగీత సొసైటీలకు 40 శాతం మద్యం షాపులు కేటాయించాలని ఏపీ కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం కష్టాల్లో ఉన్న కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించి, గీత కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను తక్షణం ప్రక్షాళన చేయాలన్నారు. కల్లు గీత కార్మిక సొసైటీలకు పూర్తి జవసత్వాలు తీసుకొచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, గీత కార్పొరేషన్ పునరుద్ధరించి ప్రభుత్వానికి, గీత కార్మికులకు మధ్య వారధిగా పనిచేయాలని కోరారు. అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రతిఏటా బడ్జెట్లో గీత కార్మికుల సంక్షేమానికి రూ.5 వేల కోట్లు నిధులు కేటాయించి ఖర్చు చేయాలన్నారు. ప్రమాదంలో చనిపోయిన గీత కార్మిక కుటుంబాలకు నెల దాటకుండా రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. నీరా, తాటి ఉత్పత్తుల పరిశ్రమలు నెలకొల్పి గీత కార్మికుల బిడ్డలకు ఉపాధి కల్పించాలన్నారు. కల్లు గీత కార్మికులను ప్రమాదం నుంచి కాపాడేందుకు ప్రభుత్వమే ఉచితంగా సేఫ్టీ మోకులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గీత వృత్తి ఆధునీకరణకు నిపుణులతో అధ్యయన కమిటీ వేసి వృత్తిలో ఉపాధి అవకాశాలను పెంచాలని నరసింహామూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో కళా ప్రదర్శన



ఫైర్‌స్టేషన్ సెంటర్లో కళా ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 15 నుంచి ఏలూరులో నిర్వహించే రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం సాయంత్రం స్థానిక కొత్తబస్టాండ్ సెంటర్ నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్‌స్టేసన్ సెంటర్లో రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.వర్మ మాట్లాడుతూ రైతు ఉద్యమ చరిత్ర గల ఏలూరు నగరంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ మహాసభల్లో రైతాంగ సమస్యలపైనా, వ్యవసాయ రంగంలో కేంద్రం ప్రభుత్వం తీసుకొస్తున్న విధానాలపైనా చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర కోశాధికారి ఎస్ లలిత కుమారి మాట్లాడుతూ మహాసభల్లో తొమ్మిది రాష్ట్రాల నుంచి రైతు ఉద్యమ నాయకులు, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు వడ్డే శోభనాదీశ్వరరావు, జేడీ లక్ష్మీనారాయణ తదితర మేధావులు పాల్గొంటున్నట్టు చెప్పారు. కార్యక్రమానికి రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి షేక్ బాషా నాయకత్వం వహించారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులు రూపొందించిన క్రికెట్ స్టేడియంతో ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్ : వేసవి సెలవుల్లో విద్యార్థులు తయారుచేసిన వివిధ బోధనోపకరణాలను ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి ప్రభుత్వ పాఠశాలలో పాఠశాలలు పునఃప్రారంభమైన రోజు గురువారం తీసుకొచ్చి ఉపాధ్యాయులకు అందజేశారు. ఆరో తరగతి ఫణి కృష్ణ వర్మ, సాయి కృష్ణ వర్మ తయారుచేసిన అన్ని సౌకర్యాలతో కూడిన క్రికెట్ స్టేడియం ఉపాధ్యాయులను ఆకట్టుకుంది. విద్యార్థులను ఆలోచింపజేసింది. స్టేడియం తయారుచేసిన విద్యార్థులను హెచ్ఎం ఎస్ వెంకట లక్ష్మి, ఉపాధ్యాయులు పువ్వుల ఆంజనేయులు, అపర్ణ, శివశంకర్, ఎలిజబెత్, కామాక్షమ్మ, వెంకటేశ్వరమ్మ, ఉషశ్రీ,దుర్గ, యశ్మిన్, మణి అభినందించారు.

మలేరియా జ్వరాలపై అవగాహన



కొవ్వలిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

దెందులూరు : మలేరియా జ్వరాల వ్యాప్తి, నిర్మూలనపై ప్రజలకు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అవగాహన కల్పించారు. గురువారం కొవ్వలిలో పోతునూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ హరిబాబు, పద్మావతి ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ కీటకాలన్నింటిలో దోమల అత్యంత ప్రమాదకరమన్నారు. వీటి వల్ల మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలుతాయని, దోమల నిర్మూలనపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలని సూచించారు. మలేరియా, డెంగీ దోమలు ఇళ్ల వద్ద మంచినీరు నిల్వ ఉండే తొట్టెలు, డ్రమ్ములు, వాడేసిన టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు, రుబ్బురోళ్లు, పూలకుండీలు, ఫ్లవర్‌వాజ్‌ల్లో పెరుగుతాయని చెప్పారు. వారానికి ఒకసారి పరిశుభ్రత పాటించడం ద్వారా దోమలను అరికట్టవచ్చని సూచించారు. జ్వరం వస్తే అశ్రద్ధ చేయవద్దని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 63 రకాల రక్తమూత్ర పరీక్షలు నిర్వహిస్తారని, ప్రతి ఒక్కరూ ఈ సేవలను వినియోగించుకోవాలని అన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ ప్రవల్లిక, నాగలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసరావు, సురేష్, ఏఎన్ఎం సరిత, ఆశ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

లారీని ఢీకొని వ్యక్తి మృతి

ఉంగుటూరు: భీమడోలు మండలం కురెళ్లగూడెం గ్రామానికి చెందిన దుగ్గిరాల లక్ష్మణరావు (63) ద్విచక్ర వాహనంపై నిడదవోలు వెళ్తుండగా ఉంగుటూరు వద్ద ఆగి ఉన్న లారీని ఢీ కొట్టారు. దీంతో ఆయన తలకు తీవ్రగాయం కాగా తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మణరావు మృతిచెందారు.

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, ధర్మల రమేష్‌లు గురువారం ఒక ప్రకటనలో కోరారు. నూతన ప్రభుత్వం మెగా డీఎస్సీపై ప్రకటన చేస్తున్న నేపథ్యంలో ఏజెన్సీలో కూడా ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని వారు కోరారు. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన నిరుద్యోగ యువతీ యువకులతో ఈ ప్రాంతంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని పేర్కొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

కొయ్యలగూడెం: యర్రంపేట పంచాయతీ ఏడువాడలపాలెం గ్రామంలో గురువారం ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పొంగుటూరు సెక్టార్ సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ పీఓ యూఎన్.స్వర్ణకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల తల్లులకు సమావేశం ఏర్పాటు చేసి గ్రాడ్యుయేషన్ డే విశిష్టతను వివరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ చదువును పూర్తి చేసుకొని ప్రాథమిక పాఠశాలకు వెళుతున్న చిన్నారులకు వీడ్కోలు పలికారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కె.మాధవి, ఎన్.కనకదుర్గ, కె.రాజీరత్నం, ఎం రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు

కామవరపుకోట: ఏలూరు సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ తాతపూడి ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో ఏపీఎస్‌ఆర్టీసీ దివ్యాంగులకు ఇచ్చే బస్సు పాసులను గురువారం స్థానిక రోమన్ క్యాథలిక్ మిషన్ ఆవరణలో ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఫాదర్ ఇమ్మానియేలు మాట్లాడుతూ మా సంస్థ ద్వారా ఇప్పటికే 620 మందికి ఉచిత బస్సు పాస్‌లు అందజేశామన్నారు. అర్హతలను బట్టి ఏలూరు డిజేబుల్డ్ వెల్ఫేర్ ఆఫీస్ ద్వారా దివ్యాంగులను పరీక్షించి అవసరమైన వారికి వీల్ ఛైర్స్, ట్రై సైకిల్స్, కాలిపర్స్, హియరింగ్ మిషన్స్, ల్యాప్‌టాప్, స్మార్ట్ ఫోన్స్, లోన్స్, హ్యాండ్ స్టిక్స్, వాకర్స్, ట్రైన్ పాసులు అందించి, పోలియో ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తామని ఆయన తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబర్లు 63036 10275, 91336 21253 సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఫాదర్‌లు అమ్మన్న రాజా, పీటర్ ప్రసాద్, ఎస్ కృపానందం, కాసు కుమారి, ఝాన్సీ రాణి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



దెందులూరు: వైఎస్సార్ సీపీ హయాంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాఠశాల విద్యార్థుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రవేశపెట్టిన జగనన్న విద్యాకానుకను ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం స్టూడెంట్ కిట్‌గా పేరు మార్చింది. పాఠశాలలు గురువారం పునఃప్రారంభం కావడంతో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. గత ప్రభుత్వం జగనన్న విద్యా కానుకగా స్కూల్ బ్యాగ్, యూనిఫామ్, షూ, సాక్స్, బెల్ట్, టెస్ట్‌బుక్స్, నోట్‌బుక్స్ ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు అందించేంది. టీడీపీ ప్రభుత్వం పాఠశాల పునఃప్రారంభోత్సవం రోజున స్టూడెంట్ కిట్‌గా పేరు మార్చి, టెస్ట్‌బుక్స్, నోట్‌పుస్తకాలు, బెల్టు మాత్రమే విద్యార్థులకు అందించారని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. యూనిఫామ్, షూ, సాక్స్, బ్యాగు ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వీటిని త్వరలో విద్యార్థులకు అందిస్తామని ఉన్నతాధికారులు, మండలాధికారులకు చెప్పినట్లు తెలిసింది.


విద్యార్థులతో సందడిగా స్కూళ్లు



విజయరాయిలో హైస్కూల్‌కు పరుగుతీస్తున్న విద్యార్థులు

పెదవేగి : వేసవి సెలవుల అనంతరం గురువారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. పెదవేగి మండలంలో అన్ని గ్రామాల్లో పాఠశాలలకు విద్యార్థులు ఉత్సాహంగా తరలివచ్చారు. విద్యార్థులకు ఎంఈఓ–2 అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాల పంపిణీ 70 శాతం పూర్తి చేశారు. మండలంలో 7078 విద్యార్థులు ఉండగా, మిగిలిన 30 శాతం విద్యార్థులకు కిట్లను పంపిణీ చేయాల్సి ఉంది. ఈనెలఖరు వరకు అడ్మిషన్లు నిర్వహిస్తారు. పాఠశాల మొదటి రోజు ఉపాధ్యాయులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మేరీ లైఫ్ అనే కార్యక్రమాన్ని సేవ్ వాటర్, క్లీన్, హైజిన్, అంశాలను విద్యార్థులకు వివరించారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన వృక్షం



జానంపేటలో రోడ్డుకు అడ్డంగా పడిన వృక్షం

పెదవేగి : భారీ ఈదురు గాలులకు ఓ వృక్షం నేలకొరిగింది. పెదవేగి మండలం జానంపేట వద్ద గురువారం సాయంత్రం ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో వృక్షం నేలకొరిగింది. దీంతో ఏలూరు – చింతలపూడి రహదారిపై వాహనాలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు, స్థానికుల యుద్ధప్రాతిపదికన పడిన చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

బిషప్ జయరావు సేవలు అసామాన్యం



బిషప్ జయరావును ప్రత్యేక మాలతో సత్కరిస్తున్న ఫాదర్ రాజు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు కథోలిక పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు సేవలు అసామాన్యమని నిర్మలగిరి పుణ్య క్షేత్రం ప్రతినిధి, ఏలూరు మేత్రాసనం ప్రాక్యూరేటర్ ఫాదర్ రాజు అన్నారు. జయరావు బిషప్‌గా ప్రకటించి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గురువారం స్థానిక బిషప్ హౌస్‌లో ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి ప్రత్యేకమాలతో సత్కరించారు. ఫాదర్ రాజు మాట్లాడుతూ బిషప్ జయరాజు ఏలూరు పీఠం పరిధిలో చేసిన సేవా కార్యక్రమాలను వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక శనివారపుపేట సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యానగర్, శ్రీనివాస నగర్, సారధి ఫంక్షన్ హాల్ ప్రాంతం, అన్నే వెంకటేశ్వరరావు కాలనీ, బెన్నిలా చర్చ్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ



కొవ్వలి హైస్కూల్లో పర్యావరణ దినోత్సవం

దెందులూరు : పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని ఎంఈఓ–2 కె.అన్నమ్మ అన్నారు. గురువారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జీఎస్ఎల్ఎన్‌వీ శర్మ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవ వారోత్సవాలను అన్నమ్మ ప్రారంభించారు. భూమి, నేల, చెట్టు, నీరు అంశాలపై విద్యార్థులకు సైన్సు ఉపాధ్యాయులు కరుణకుమారి, రాధాకృష్ణ, మజీద్‌ఖాన్‌లు అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అన్నారు. అనంతరం ఏకో క్లబ్ విద్యార్థులు పర్యావరణంపై గీసిన చిత్రాలను పాఠశాలలో ప్రదర్శించారు.

వేగంగా మిలినియం చర్చి నిర్మాణం

దెందులూరు: స్థానిక గౌడవీధిలో సాల్వేషన్ ఆర్మీ మిలినియం చర్చి నిర్మాణ పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ పనులను గురువారం స్థానిక కోర్ ఆఫీసర్ మేజర్ కాకి రమణయ్య, సంఘపెద్దలు, దాతలు పరిశీలించారు. చర్చి నిర్మాణానికి రెండు సెంట్ల స్థలాన్ని దివంగత రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పల్లె యోహాన్, చంద్రహాస్ దంపతులు ఇచ్చిన సంగతి విధితమే.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	45
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	28
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21,.15	4822	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	34
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	28
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	30
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	--
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.10	98503	--
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	56	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	108
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	07, 10
బెండకాయలు	34	కంద	64
పచ్చిమిర్చి	54-58	బీట్‌రూట్	50
కాకర కాయలు	44-56	కీరా దోస	54
బీరకాయలు	58	ఫ్రెంచ్‌బీన్స్	144
బీరకాయలు (పందిరి)	--	అల్లం	188
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	30-55
క్యారెట్	48-56	పాలకూర	15
దొండకాయలు	30	చుక్కకూర	15
బంగాళదుంపలు	34	తోటకూర	12
ఉల్లిపాయలు	38	గోంగూర	07
గోరుచిక్కుడు	64	పుదీనా	05
దోసకాయలు	30	బఠాణి	--
అనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	50